క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీలు, 400 పెన్నుల బహూకరణ



పెదపూడి ఉన్నత పాఠశాలకు కుర్చీలు, పెన్నులు అందజేస్తున్న పూర్వ విద్యార్థి సతీష్‌కుమార్

పెదపూడి: విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థుల దాతృత్వం అభినందనీయమని ఎంఈఓ-1 కె.సత్యనారాయణ అన్నారు. పెదపూడిలో గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి సతీష్ కుర్చీలు, పెన్నులు, ఇతర విద్యాసామగ్రి బుధవారం కె.సత్యనారాయణకు అందజేశారు. ఇదే పాఠశాలలో 2015-2016 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థి ఎం.సతీష్‌కుమార్ ఈ సామగ్రిని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఏడీఎంఓ



పీహెచ్‌సీలో వైద్య పరీక్ష చేస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వసుంధర

రాజానగరం: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా అదనపు వైద్యాధికారి (ఏడీఎంఓ) డాక్టర్ ఎస్.వసుంధర బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. టీబీ పేషెంట్ల కార్డులను, లెప్రసీ, ల్యాబ్ రిపోర్టులను, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సమయంలో ఆస్పత్రికి వచ్చిన కొంతమంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్థానిక జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రిలో జరిగిన కోకమిటీ సమావేశానికి హాజరయ్యారు.

ఏడీఈని కలిసిన విద్యుత్తు శాఖ సిబ్బంది

రంగంపేట: విద్యుత్తు శాఖ ఏడీఈని స్థానిక విద్యుత్తు శాఖ సిబ్బంది బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. అనపర్తి డివిజన్ విద్యుత్తు శాఖ ఏడీఈగా గోపాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో రంగంపేట విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో గోపాలకృష్ణ రంగంపేట విద్యుత్తు సబ్ స్టేషన్‌లో ఏఈగా పనిచేశారు.

చంద్రశేఖరస్వామికి నేడు అభిషేకాలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు కృష్ణ తెలిపారు. ఉదయం 6 గంటలకు అభిషేకాలు, అనంతరం కాత్యాయనీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. రంగంపేటలో ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్టు మైలవరపు నాగేంద్రకుమార్ తెలిపారు.

ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

బిక్కవోలు: గణేశ్ ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, శాంతిసామరస్యాల నడుమ నిర్వహించుకోవాలని ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ సూచించారు. బుధవారం ఇలపల్లిలో గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు అడుగుల కంటే ఎత్తు ఉన్న విగ్రహాలు పెట్టవద్దని సూచించారు. విగ్రహాలు పెట్టడానికి అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, డీజే వంటివి లేకుండా నిమజ్జనం కార్యక్రమం నిర్వహించాలన్నారు.

దమ్ము ట్రాక్టర్ సీజ్



కోటపాడులో పోలీసులు సీజ్ చేసిన దమ్ము ట్రాక్టర్

రంగంపేట: దమ్ము ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్సై శివ ప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ కోటపాడులో ఫుల్ వీల్స్ వేసుకుని ఏడీబీ రోడ్డు మీద దమ్ము ట్రాక్టర్ నడుపుతున్నట్టు సమాచారం అందడంతో వెంటనే వెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. పొలాలలో దమ్ములు చేసిన తర్వాత ట్రాక్టర్లను నేరుగా ఆ చక్రాలతో రోడ్ల పైకి తీసుకొస్తున్నారు. దీంతో కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లు ఛిద్రం అవుతున్నాయన్నారు. రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గోదావరికి పెరిగిన వరద ఉధృతి

- ముంపుబారిన పల్లపు ప్రాంతాలు
- అంటువ్యాధుల బారిన ప్రజలు
- పశువులకు పచ్చిమేత కొరత



జగన్నాథపురం-బూరుగుపూడి మధ్య పంట పొలాలను ముంచెత్తిన వరదనీరు



బుచ్చెంపేట-మునగాల మధ్య గోదావరికి పోటెత్తిన వరదనీరు

మధురపూడి: గోదావరికి వరద ఉధృతి పెరిగింది. ఉప్పొంగుతున్న కొండ కాలువల కారణంగా ముంపు ముప్పు పొంచి ఉంది. ఏటా వర్షాకాలంలో గోదావరికి వరద పోటెత్తినప్పుడు రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి గోదావరి, కాలువల పరివాహక ప్రాంత వాసులకు ముంపు సమస్య అపరిష్కృతంగానే ఉంది. నదీ పరివాహక ప్రాంతం రాజకీయ నాయకులకు ఆదాయ వనరుగా ఉంది. వరద బాధితుల సహాయ పనులు, వివిధ సంక్షేమ కార్యక్రమాల మాటున ప్రజాప్రతినిధులు, అధికారులు ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారేగాని ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

18 గ్రామాలకు ఏటా ముంపు ముప్పు

మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గానికి చెందిన 18 గ్రామాలకు చెందిన ప్రజలు ఏటా ముంపు సమస్యతో సతమతమవుతున్నారు. ముంపు కారణంగా పలు గ్రామాలకు చెందిన ప్రజలు కలుషిత నీటినే తాగాల్సి వస్తోంది. దీంతో డయేరియా, జ్వరాలు, అంటు వ్యాధుల బారిన పడుతున్నారు.

కొండ గోదావరికి వరద

గోదావరి వరద ప్రవాహంతో పాటు, కొండ గోదావరి విరుచుకుపడటంతో ముంపు సమస్య ఏర్పడుతోంది. దీంతో కోరుకొండ మండలంలోని బుచ్చెంపేట, జగన్నాథపురం, మునగాల, శ్రీరంగపట్నం, గ్రామాల నివాస స్థలాలకు ముంపు సమస్య ఉంటుంది. బూరుగుపూడి, కాపవరం, కోటి, మునగాల, శ్రీరంగపట్నం, రాఘవపురం తదితర గ్రామాల్లోని పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. సీతానగరం మండలంలోని పలు గ్రామాలు ముంపు ప్రమాదం ఉంది. పంట పొలాలు నీట మునగడంతో వ్యవసాయ కూలీలు పనులు కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోగాలు బారినపడటంతో, వైద్యం నిమిత్తం అప్పుల పాలవుతున్నారు.

బురద కాలువ ప్రయాణం ఇలా..

బురద కాలువ కోరుకొండ మండలంలో ఉగ్రరూపం దాల్చింది. ఈ కాలువ గంగవరం మండలం నెల్లిపూడి గ్రామం నుంచి బయలుదేరి గంగవరం, దేవీపట్నం, గోకవరం, కోరుకొండ మండలాలగుండా 100 కిలోమీటర్లు ప్రయాణించి గోదావరిలో కలుస్తోంది. గంగవరం మండలం ఏగులోవ కొండల్లోంచి నెల్లిపూడిలో పెద్దకాలువగా పిలువబడే కాలువ, యావనాపల్లి మీదుగా ప్రయాణించే సూరంపాలెం కాలువలో కలిసి మరింత వేగంగా ప్రయాణిస్తోంది. ఇవి రెండూ గోకవరం మండలం కొత్తపల్లి-యర్రంపాలెం గ్రామాల వద్ద మరికొన్ని కాలువలతో కలుస్తాయి. దీనినే బురద కాలువ అంటారు. ఇది శ్రీరంగపట్నం వద్ద వరద బీభత్సాన్ని సృష్టిస్తోంది. ఎన్నో ఏళ్ల ఈ సమస్య పరిష్కారం కాలేదు.

2,500 ఎకరాల పంటనీటి పాలు

ఉగ్రగోదావరి కారణంగా 2,500 ఎకరాల విస్తీర్ణంలోని పంట పొలాలు ముంపు బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. వరదనీరు మెరక గ్రామాలకు చేరడంతో సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద తొర్రిగెడ్డ కాలువగుండా కోరుకొండ మండలంలోని బుచ్చెంపేట, జగన్నాథపురం, మునగాల గ్రామాలతో పాటు, సీతానగరం మండలం మిర్తిపాడు, ఉండేశ్వరపురం, రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని తొర్రేడు గ్రామాలకు వరదనీరు చేరుతోంది, నివాస గృహాలను సైతం ముంచెత్తుతోంది.

పశుగ్రాసం కొరత

పంట పొలాలు, పచ్చిక బయళ్లు ముంపుబారిన పడటంతో పాడి పశువులకు పచ్చిమేత కొరత ఏర్పడింది. మేకలు, గొర్రెలకు కూడా మేత దొరకడం కష్టమవుతోంది. పల్లపు ప్రాంతాల్లో వరద నీరు చేయడంతో తాగునీరు కలుషితమవుతోంది. పశువులు కూడా రోగాలబారిన పడుతున్నాయి. కోరుకొండ మండలంలోని బుచ్చెంపేట, జగన్నాథపురం, మునగాల, శ్రీరంగపట్నంలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ప్రభుత్వం పశుగ్రాసాన్ని అందించాల్సి ఉంది. పశువైద్యశాఖ ఆధ్వర్యంలో రోగాల నివారణపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

శాశ్వత పరిష్కారం చూపాలి



ముంపు సమస్య పరిష్కారానికి పాలక వర్గాలు శాశ్వత చర్యలు చేపట్టాలి. ఏటా పంట పొలాలను వరదనీరు ముంచెత్తడంతో ధాన్యం దిగుబడి తగ్గుతోంది. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బురద కాలువ కారణంగా శ్రీరంగపట్నం చుట్టూ వరద నీరు చేరుతోంది. పొలాల్లోకి వరద నీరు చేరడంతో పంటలను తెగుళ్లు ఆశిస్తున్నాయి. పశువులకు పశుగ్రాసం, పచ్చిమేతను అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– బుద్దిగ సత్తిబాబు, సొసైటీ మాజీ చైర్మన్, బూరుగుపూడి

సహాయక చర్యలు చేపట్టాలి



ముంపు ప్రాంతాలను ముందే గుర్తించి అక్కడ సహాయక చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం ప్రజలపట్ల అలసత్వాన్ని ప్రదర్శించకూడదు. రైతులకు విత్తనాలను ఉచితంగా ఇవ్వాలి. వ్యవసాయ కూలీలకు బియ్యం, నిత్యవసర సరకులు అందించాలి. ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి. స్థానికులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి.

– కొండపల్లి దుర్గారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

వర్క్ ఫ్రమ్ హోమ్ కౌశల్ సర్వే వేగవంతం



మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ కౌశల్ సర్వేను అధికారులు బాధ్యతగా, వేగవంతంగా చేపట్టి దానికి సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి సకాలంలో సమర్పించాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీల్లోని డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ సేవా పేమెంట్స్ గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలకు వసూలు చేస్తున్న సొమ్ము (ఏపీ సేవా పేమెంట్స్) ప్రభుత్వానికి వెనువెంటనే చెల్లించాలన్నారు. పీజీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ రిపోర్టులు పెండింగ్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. డిజిటల్ అసిస్టెంట్లు అందరూ గ్రామపంచాయతీ పేరున పాన్ కార్డు రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఎన్ రెడ్డి, పరిపాలనాధికారి ఎం.శ్రీనివాస్ కలిసి ఈ క్రింది విషయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఎరువుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి



పుట్టకొండలో ఎరువులు, పురుగు మందుల షాపులో తనిఖీ చేస్తున్న ఏఓ సత్యప్రసాద్

పెదపూడి: గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల షాపుల యజమాన్యాలు నిబంధనలు పాటించాలని వ్యవసాయశాఖ మండలాధికారి ఎస్.సత్యప్రసాద్ అన్నారు. వేండ్ర, గండ్రేడు, పుట్టకొండలో ఎరువులు, పురుగు మందులు షాపుల్లో బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు, సరుకు నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు, వరి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల వద్ద సరుకుల వివరాలు తెలిపే ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కొనుగోలుకు రైతుకు రశీదు తప్పని సరిగా ఇవ్వాలని షాపు యజమానులకు ఆయన సూచించారు. వ్యవసాయశాఖ సహాయకులు, సిబ్బంది ఉన్నారు.

మాజీ మంత్రి కన్నబాబుకు పరామర్శ



కురసాల సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి : పితృవియోగంతో బాధపడుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబును, ఆయన కుటుంబ సభ్యులను అనపర్తి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు బుధవారం పరామర్శించారు. కాకినాడలోని కన్నబాబు స్వగృహంలో వారు దివంగత కురసాల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సత్యనారాయణ మృతి వారి కుటుంబానికే కాకుండా జిల్లాలో పార్టీకి తీరని లోటని అన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ సత్తి నాగిరెడ్డిరాజా, పెదపూడి వైస్ ఎంపీపీ కర్రెడ్ల వెంకన్న బాబు, వేండ్ర సర్పంచ్ కోసూరి వాసు ఉన్నారు.

గణపతి నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం



పందలపాకలో పందిరి రాట ముహూర్తం పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు, మహిళలు



కుతుకులూరులో గణపతి ఆలయం వద్ద పందిరి రాటకు పూజ చేస్తున్న భక్తులు

బిక్కవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాలకు పందలపాక వెలంపేట వద్ద పందిరి రాట ముహూర్తంతో శ్రీకారం చుట్టారు. బుధవారం స్థానిక రామాలయం వద్ద ముందుగా గణపతికి మహిళలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కూనిరెడ్డి సాంబశివ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నామని తెలిపారు. 19 సంవత్సరాల నుంచి గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోని సర్పంచి సబ్బారపు పద్మావతి, అనపర్తి, మండపేట నియోజకవర్గాల బ్రహ్మానాయుడు వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి శ్రీనువాసురావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డు ముత్యాలరావు, యాసలపు శ్రీనువాస్, బొడ్డు అప్పారావు,గొర్రిపోటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుతుకులూరు గణపతి ఆలయం వద్ద ..

అనపర్తి : కుతుకులూరులో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయం వద్ద వినాయక చవితిని పురస్కరించుకొని ఏర్పాట్ల పనులను ప్రారంభించడానికి బుధవారం రాట ముహూర్తం పూజలు నిర్వహించారు. పురోహితులు రాంబాబు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బిక్కవోలు: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలుకు చెందిన కొమ్ము రాణి కుమార్తె ఈ నెల 19న అదే గ్రామానికి చెందిన తన పిన్ని మాణిమాలకు ఇంటికి వెళ్లింది. చీకటి పడినా తన కుమార్తె తిరిగిరాక పోవడంతో రాణి తన చెల్లి, బంధువుల ఇంటివద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆరు తడితో నీటి ఆదా



కొప్పవరంలో రైతులకు శిక్షణనిస్తున్న వ్యవసాయశాఖాధికారులు వల్లీ, సురేష్

అనపర్తి : వరి పంటలో ఆరు తడి విధానంలో సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేయడం దిగుబడిని పెంచడం లక్ష్యంగా రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు అడిషనల్ డీపీఎం వల్లి తెలిపారు. బుధవారం కొప్పవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీపీఎం మాట్లాడుతూ నీటి వినియోగం తగ్గించడం, నేల ఆరోగ్యం మెరుగుపరచడం, సాగు ఖర్చులు తగ్గించడం ద్వారా సాగు లాభదాయకమవుతుందని రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి సురేష్ మాట్లాడుతూ పంటలో పర్యావరణ హితమైన ప్రకృతి వ్యవసాయ విధానాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో కొప్పవరం రైతులు పాల్గొన్నారు.

ఘాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: గోదావరి వరద ఉధృతి కారణంగా రేవుల్లోని ఘాట్ల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్నానాలకు ఎవరూ దిగరాదని తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ములకల్లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ములకల్లంక ప్రజలకు తొర్రేడులోని జిల్లా పరిషత్ హైస్కూల్ పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. నాటు పడవల్లో ప్రయాణం మానుకోవాలని, లంక భూముల్లో ఉన్న పశువుల, మేకలు, గొర్రెలను గ్రామాల్లోకి తీసుకురావాలన్నారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీపై కేసు నమోదు

బిక్కవోలు: మండలంలోని తహసీల్దార్ సంతకం ఫోర్జరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బలభద్రపురంలోని 311 సర్వే నంబరులో తనకు 52 సెంట్లు పట్టా భూమి ఉందని, అప్పటి తహసీల్దార్ డీఎస్ శర్మ పట్టా ఇచ్చారని తెలుపుతూ మండ ఆదిరెడ్డి కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు సర్వే చేసి 311 సర్వే నంబరు రామరాజు చెరువుకు సంబంధించిన భూమిగా తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ గుర్తించారు. ఈ స్థలానికి పట్టా ఇవ్వకూడని ఆయన అన్నారు. ఆదిరెడ్డి 2019లో పొందిన ఈ పట్టాపై అప్పటి తహసీల్దార్ శర్మ సంతకం ఉందన్నారు. దీనిపై తహసీల్దార్ శర్మకు లేఖ రాశారు. దానికి సమాధానంగా శర్మ తాను ఎవరికీ చెరువుకు సంబంధించిన భూమిలో పట్టాలు ఇవ్వలేదని వివరణ ఇచ్చారు. తన సంతకం ఫోర్జరీ చేశారని ఆయన తెలపడంతో తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


రైతుల గోడును పట్టించుకోని కూటమి ప్రభుత్వం



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి : ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని, రైతు ర్యాలీ వేదికలో ఆయన రైతులనుద్దేశించి కల్లబొల్లి కబుర్లు చెప్పారని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ తొలి ఏడాదే రైతు భరోసా ఎగ్గొట్టి అన్నదాతలకు పంగనామం పెట్టిన కూటమి ప్రభుత్వం నేడు నష్టపరిహారం, బీమా అనే మాటలు వినబడకుండా చేశారన్నారు. పెదపూడి మండలంలోని రైతులు ఎకరానికి రూ.10 వేలు నష్టపోయామని చెప్పినా, ఆ బాధను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.భవిష్యత్తులో వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. కూటమి నాయకుల తీరుమారకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని డాక్టర్ హెచ్చరించారు.

జియోసైన్సెస్‌లో పట్టు సాధించాలి



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న అధ్యాపకులు

రాజానగరం: జియోసైన్సెస్‌లో విద్యార్థులు మంచి పట్టును సాధించడంతోపాటు పరిశోధనలపై దృష్టి సారిస్తే ఉన్నత స్థానాలను పొందవచ్చని హెచ్‌ఓడీ ఆచార్య వై. శ్రీనివాసరావు సూచించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ జియోసైన్సెస్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ డీవీఎస్ రాజు అండ్ మహాదేవన్ మెమోరియల్ అవార్డ్స్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జియోసైన్సెస్‌లో మెరిట్ విద్యార్థులకు మెమోరియల్ అవార్డులు అందజేశారు.ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల ఎదురుచూపు



కోటపాడులో యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

రంగంపేట: యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదు. కొద్ది రోజులుగా యూరియా కొరత రైతులను తీవ్రస్థాయిలో వేధిస్తోంది. ఈ కారణంగా రైతులు రైతు సేవా కేంద్రాల చుట్టూ, సొసైటీల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ముందస్తు చర్యలు చేపట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ విఫలం కావడంతో రైతులకు అవస్థలు అధికమయ్యాయి. రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి సొసైటీల ద్వారా అరకొరగా యూరియా అందివ్వడంతో మిగిలిన గ్రామాల రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి, చంద్రేడు, పెదరాయవరంలో తాజాగా పది టన్నుల చొప్పున యూరియా అందించామని, మరో 90 టన్నుల యూరియాకు ఇండెంట్ పెట్టామని మండల వ్యవసాయ అధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. వర్షాలు వరుసగా కురుస్తుండటంతో రైతులు అందరికీ ఒకేసారి యూరియా అవసరమయ్యిందని దీనివల్ల యూరియా కొరత ఏర్పడినట్టు ఆయన తెలిపారు.

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

రాజానగరం: నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంతోపాటు ఆత్మపరిశీలనతో భవిష్యత్తు వైపు అడుగులు వేస్తూ, క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించేలా పయనించడమే 'జీవితానికి శిక్షణ' అని కాలిఫోర్నియాకు చెందిన లైఫ్ కోచ్ నంద లంకలపల్లి అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో గందరగోళం నుంచి స్పష్టత వరకు అనే అంశం పై బుధవారం నిర్వహించిన లైఫ్ కోచింగ్ సెషన్ లో ఆయన పాల్గొన్నారు. భావోద్వేగాలను నియంత్రించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జీజీయూ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, అధ్యాపకులు డాక్టర్ కె. వల్లీమాధవి పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యానికి బలవుతున్న పేదలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో కొందరు వైద్యుల నిర్లక్ష్యానికి పేదలు బలవుతున్నారని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద రోగులకు వైద్యులు మెరుగైన చికిత్స అందించడం లేదని ఆయన మండిపడ్డారు. నగరంలోని సుబ్బారావునగర్‌కు చెందిన జువ్వల రాజేష్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మంగళవారం అర్ధరాత్రి అత్యవసరంగా అతడి కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారని, వైద్యుడు కనీసం రోగిని పరీక్షించకుండా కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి సిఫార్సు చేశారని తెలిపారు. అర్ధరాత్రి అవస్థలు పడుతూ రాజేష్‌ను అతని కుటుంబసభ్యులు కాకినాడకు తరలించారని తెలిపారు. కాకినాడలో వైద్యులు రాజేష్‌ను పరీక్షించి చికిత్స చేసి బుధవారం ఇంటికి పంపించారన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడి తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కొండబాబు తెలిపారు.